ప్రజాశక్తి
మంగళవారం 28 మార్చి 2023
5
విజయనగరం



నగరాభివృద్ధే ధ్యేయం: మేయర్

45 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరాభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారని మేయర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన మేయర్ విజయలక్ష్మి అజెండాలోని అంశాల వారీగా సభ్యులు అభిప్రాయాలను స్వీకరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను నగరంలో చేపట్టబోయే అభివృద్ధి పనులు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు చెప్పారు. కమిషనర్ ఆర్. శ్రీ రాములునాయుడు మాట్లాడుతూ సభ్యుల సూచనలు, సలహాలు మేరకు నగర అభివృద్ధికి మరింత కృషి చేస్తామని అన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు పట్నాన పైడ్రాజు, బి.ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

- విద్యాశాఖా మంత్రి బొత్స
- స్వయం సహాయక సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా పంపిణీ

ప్రజాశక్తి- వంగర, గుర్ల

మహిళల సాధికారితే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం సోమవారం వంగరలో జరిగింది. తొలుత మండల కేంద్రంలో రూ.90 లక్షలతో కొత్తగా నిర్మించిన తాహశీల్దార్ కార్యాలయాన్ని, రూ.12.5 లక్షలతో ఆధునీకరించిన కోల్డ్ స్టోరేజ్‌ను, రూ.15.5 లక్షలతో ఆధునీకరించిన వ్యవసాయ వృత్తిదారుల సంఘ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడికి సమీపంలో ఏర్పాటు చేసిన సభలో వైఎస్ఆర్ ఆసరా పథకం కింద మూడవ విడత పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మండలంలోని 772 సంఘాలకు చెందిన 8,306 మంది మహిళలకు రూ.5.55కోట్ల విలువైన చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, తమది చేతల ప్రభుత్వమని, ఏదైతే చెబుతామో...దానిని చేసి చూపిస్తామని అన్నారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబులా ప్రజల్ని మోసం చేసే అలవాటు తమకు లేదని అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేయడం ద్వారా, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి పూర్తిగా నిలబెట్టుకున్నారని చెప్పారు. ప్రజలు తమచుట్టూ జరుగుతున్న అభివద్ధిని, అమలు జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను గమనించాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేస్తుంటే ముఖ్యమంత్రి జగన్ పై కొంతమంది ఆడిపోసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్ కావాలా దోపిడీ చేసిన చంద్రబాబు కావాలా అని ప్రశ్నించారు.

కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం ఉండాలన్నారు. వంగర గ్రామంలో సచివాలయ భవనం పూర్తి చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేయడం ద్వారా, ప్రజల కళ్లలో ఆనందాన్ని చూస్తున్నామని చెప్పారు. రాజాం ఎంఎల్ఎ కంబాల జోగులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్



మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

మాట్లాడారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఆర్‌డిఒ అప్పారావు, శ్రీకాకుళం జెడ్‌పి వైస్ ఛైర్మన్ జగన్మోహనరావు, జెడ్‌పిటిసి కరణం రాధ, ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జి, తాహశీల్దార్ ఐజాక్, ఎంపిడిఒ వి.శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శన్ రావు, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గుర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నిక లో హామీ ఇచ్చిన ప్రకారం డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంకుల్లో వాడుకున్న అప్పులను మాఫీ చేస్తానని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గుర్లలో ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంల డ్వాక్రా మహిళలకు రూ.8.76 కోట్లు చెక్కును అందజేశారు. అనంతరం జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, కలెక్టర్ సూర్య కుమారి, డిఆర్‌డిఎ పీడీ కల్యాణచక్రవర్తి, ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పిటిసి శీర అప్పల నాయుడు, డిఎల్‌డిఎ ఛైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు. ఎంపిడిఓ కల్యాణి, తహశీల్దార్ పద్మావతి ,ఎ పి ఎం.నారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వై ఎస్ ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కెజిబివి పాఠశాల విద్యార్థులకు కళ్ళద్దాలు మంత్రి సత్యనారాయణ, ఆప్తాలమిక్ అధికారి శ్రీనివాసరావు పంపిణీ చేశారు..

104 వాహనాలు ప్రారంభం

గరివిడి : జిల్లాకు కేటాయించిన 19 వాహనాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం గరివిడి పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఆసుపత్రిలో వైద్యం అందించడంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ల విధానం ద్వారా గ్రామాల్లో సైతం సేవలు అందిస్తున్నామని తెలిపారు. చీపురుపల్లి పరిధిలో శ్రీ ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఎంపి ల్యాండ్ నిధులతో నిర్మించిన బస్టాండ్‌ను మంత్రి బొత్స, ఎంపి బెల్లాన చంద్రశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపిపి ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్‌పిటిసి వాకాడ శిరీష. గరివిడి ఎంపిపి మీసాల విజయలక్ష్మి. జడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, మెరకముడిదాం ఎంపిపి తాడ్డివేణు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ఒక్కపూటే పెట్టాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని
- ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉపాధి కూలీల ధర్నా

ప్రజాశక్తి - శృంగవరపుకోట

గ్రామీణ ఉపాధి హామీ ద్వారా నిర్వహిస్తున్న చెరువు పనులను ఒక్క పూటే నిర్వహించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ కమ్యూనిస్టుల త్యాగాలతో వచ్చిన ఎన్ఆర్ఇజిఎస్ చట్టానికి నేడు కేంద్రంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో ఉన్న వైసిపి ప్రభుత్వాలు తూట్లు పొడుస్తూ నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయన్నారు. వీరికి పేదలు గౌరవంగా బతకడం అంటే ఇష్టం ఉండదని అందుకే ఈ శక్తులు బడ్జెట్ కేటాయింపుల్లో నిధులు క్రమేపి తగ్గించుకుంటూ వస్తున్నాయని అన్నారు. ఎంతో కొంత కేటాయించిన బడ్జెట్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం వేరే విధులకు దారి మళ్లిస్తోందని ఆయన మండిపడ్డారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌ను తీసుకొచ్చి ఉపాధి కూలీల గ్రూపు సంఖ్యను పెంచారన్నారు. రెండు పూటల పని పెట్టి ఉపాధి పనులకు కార్మికులను దూరం చేస్తున్నారన్నారు. కార్మికుల వలసలను నిర్మూలించి గ్రామాల్లోనే కార్మికులకు ఉపాధి హామీ పని దొరికేలా 200 రోజులు పని దినాలు కల్పిస్తూ పాత పద్ధతి లోనే వేసవి అలవెన్స్‌లతో పాటు ఇతర అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేట్ల అందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ.7,500 రూపాయలు



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు తమ్మినేని సూర్యనారాయణ

వేతనాన్ని అమలు చేయాలన్నారు. పథకాన్ని నిర్వీర్యం చేయాలనే ఆలోచన విధానాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉపాధి కూలీలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటి జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, సిఐటియు ఎస్ కోట మండల కమిటీ నాయకులు చెలికాని ముత్యాలు, ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయ పనితీరు భేష్ : డిఐజి

ప్రజాశక్తి-విజయనగరం

వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని సోమవారం విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎస్. హరికృష్ణ పరిశీలించారు. ఆయనకు ఎస్‌పి ఎం.దీపిక, పోలీసు అధికారులు పలికారు. అనంతరం, జిల్లా పోలీసు కార్యాలయంలోని వివిధ సెక్షన్లు, వివిధ రకాల విధులు నిర్వహించే కార్యాలయ అధికారులు, సిబ్బంది నిర్వహించే వివిధ రికార్డులను, ఉన్నత పోలీసు కార్యాలయాలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలను పరిశీలించారు. జిల్లా నేర రికార్డ్సు బ్యూరో, స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్టు సెల్ అధికారులు, సిబ్బంది పని తీరును, రికార్డులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేసారు. పోలీసు కేంద్ర కార్యాలయం నుండి వచ్చిన స్టోర్ ఆర్టికల్స్, ఆయుధాలు, రికార్డులు, మోటారు వాహనాలు, వాటి పని తీరు, రికార్డులు, పోలీసుల సంక్షేమానికి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను డిఐజి అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోలీసుశాఖ సాధించిన ప్రగతిని, పోలీసుల సంక్షేమానికి పోలీసుశాఖ చేపడుతున్న కార్యక్రమాలను ఎస్‌పి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌పి ఎం.దీపిక, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎం.ఎం.సోల్మన్, డిఎస్‌పి ఆర్. శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్‌పి ఎల్. శేషాద్రి, డిపిఒ ఎఒ వెంకట రమణ, సిఐలు సిహెచ్. రుద్రశేఖర్, బి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్నడిఐజి హరికృష్ణ



ధర్నా చేస్తున్న దళితులు, వ్యకాస నాయకులు

దళితుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో దళితుల సమస్యలు పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామ దళితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దత్తిలో దళిత పేటకు ఆనుకొని ఉన్న కాడపు చెరువు వలన ముంపు ప్రమాదాన్ని చాలా కాలంగా భరించాల్సి వస్తుందని, చిన్నపాటి వర్షం వచ్చినా దళితపేటలోకి నీరు ప్రవేశించి అస్తవ్యస్థగా మారుతోందని అన్నారు. గతంలో ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్తే ఇరిగేషన్ అధికారులు వచ్చి తాత్కాలిక పనులు చేపట్టి వదిలేశారని అన్నారు. అంతేకాకుండా శ్మశాన స్థలానికి శవాన్ని తీసుకువెళ్లి ఖననం చేయడానికి నరకయాతన పడుతున్నారన్నారు. స్మశాన స్థలాన్ని పెంచి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన దళితులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని దళితులకు కేటాయించి పట్టాలివ్వకుండా అన్యాయం చేస్తున్నారనితెలిపారు. దళితపేటకి రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. దళితుల పట్ల అధికారులు, పాలకులు నిరక్ష్యం వహిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. అనంతరం ఎస్‌డిసి సుదర్శన దొరకు వినతి అందజేశారు. కార్యక్రమంలో సుందరరావు, గురువులు, దేవి, గౌర్నాయుడు, వారమ్మ తదితరులు పాల్గొన్నారు.

11 మంది విద్యార్థులు డిబార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ పరీక్షలలో 11మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా 25,536 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా వారిలో 24,398 మంది విద్యార్థులు హాజరు కాగా 1138 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐఒ ఎం.సత్యనారాయణ తెలిపారు. 42 కేంద్రాలను తనిఖీ బృందాలు పరిశీలించాయని చెప్పారు.

జాతీయ పోటీలకు రాష్ట్ర తైక్వాండో జట్టు పయనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు రాష్ట్ర క్రీడాకారుల జట్టు సోమవారం రాజస్థాన్ బయలు దేరినట్లు తైక్వాండో అసోసియేషన్ సహాయ కార్యదర్శి సిహెచ్. వేణుగోపాల్ తెలిపారు. ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు రాజస్థాన్ లోని కోట యూనివర్శిటీలో జరగనున్న 38వ సబ్ జూనియర్, క్యాడెట్ బాల బాలికల జాతీయ స్థాయి త్వైక్వాండో పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 43 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని తెలిపారు . పలు ఉమ్మడి జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఇటీవల విశాఖపట్నం జిల్లా యలమంచిలి లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి ఈ పోటీలకు ఎంపికయ్యారు. జట్టులో 20 మంది బాలికలు మరో 23 మంది బాలురు ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి భాస్కర్ జట్టుకు మేనేజర్ గా వ్యవహరిస్తున్నారని తెలిపారు .ఈ సందర్భంగా క్రీడాకారులను అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అచ్యుత రెడ్డి, కోశాధికారి బి. అర్జునరావు, ఉపాధ్యక్షులు ములంపాక అచ్చం నాయుడు తదితరులు అభినందనలు తెలిపారు.

స్పందనకు 163 వినతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెపుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 163 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 123 ఉన్నాయి. ఎ పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. జె.సి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు, సూర్యనారాయణ, సుదర్శన దొర పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



బాధితుల సమస్యలు వింటున్న జెసి మయూర్ అశోక్

దూరవిద్యా కేంద్రాన్ని మూసివేయొద్దు

ఎంఆర్ కాలేజీలోగల దూర విద్యా కేంద్రాన్ని మూసివేసి జిల్లాలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా ప్రభుత్వం పావులు కదపడం దారుణమని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్ పావని, అన్నారు. దూర విద్యా కేంద్రాన్ని కొనసాగించాలని కోరుతూ సోమవారం స్పందనలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ జిల్లాలో గత 30ఏళ్లగా విద్యార్థులు ఈ దూర విద్యా కేంద్రం ద్వారా విద్యను కొనసాగిస్తున్నారని, తెలిపారు. ఉన్నపలంగా డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కేంద్రాన్ని ఎత్తివేయడం సరికాదన్నారు. ఈ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే విద్యార్థులందరినీ ఐక్యం చేసి పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాము, ఎం.సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన

జిల్లాపోలీసు కార్యాయంలో ఎస్‌పి ఎం.దీపిక వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

'సీతం'లో డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

విజయనగరం : స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో నూతన డిజిటల్ లైబ్రరీ బ్లాక్ ను మాజీ ఎంపి, సత్యా విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మీ సోమవారం ప్రారంభించారు. రూ.72 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ డిజిటల్ లైబ్రరీలోని కంప్యూటర్లకు అంతర్జాల సదుపాయంతో పాటు సెంట్రలైజ్డ్ ఎసి సదుపాయం కల్పిస్తూ, విద్యార్థులకు వివిధ కోర్సులకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఈసందర్భంగా డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మీ మాట్లాడుతూ, వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన దృశ్య,శ్రవణ సందేశాలను వింటూ ఆయా సబ్జెక్టు పై పట్టు సాధిస్తూ తద్వారా ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచుకోవాలని చెప్పారు. సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి భూషణ్ రావు మాట్లాడుతూ, ఈ డిజిటల్ లైబ్రరీ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామ్మూర్తి, లైబ్రేరియన్ డాక్టర్ లెంక సత్యవతి, వివిధ విభాగాతిపతులు పాల్గొన్నారు.

ఘనంగా రాంచరణ్ జన్మదిన వేడుకలు

విజయనగరంటౌన్: సినీహీరో, మెగాపవర్ స్టార్ రాంచరణ్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం చిరంజీవి యువత, అంజనీ పుత్ర, చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ప్రసన్న స్కూల్లో పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జనసేన నాయకులు గురాన అయ్యలు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ కర్రోతు సత్యం హాజరై కేక్ కట్ చేశారు. విద్యార్థులకు బిస్కెట్స్,చాక్లెట్స్ పంచిపెట్టారు.

తాగునీటిని వృథా చేయొద్దు

- 29 నుంచి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర ప్రజలు తాగునీటిని వృథా చేయొద్దని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కుళాయిల ద్వారా నీరు వృథాగా పోకుండా చూడాలన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 29 నుంచి వారం రోజులు పాటు నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తామని చెప్పారు. ఏప్రిల్ 6 నుంచి ప్రారంభోత్సవాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నికల్లో గెలుపు ఓటములు తప్పదని, గెలిస్తే బలం ఉందని, ఓడిపోతే బలం లేదని అనుకోవడం సరికాదని కోలగట్ల అన్నారు. ఎవరైతే పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తారో వారిని పార్టీ నుంచి తప్పించడం రాజకీయ పార్టీలకు సహజమన్నారు. పార్టీ నుంచి సస్పెండ్ అయిన వారు పశ్చాత్తాపం పడకుండా పార్టీ అధిష్టానం మీద ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఉండవల్లి ఎమ్మెల్యే శ్రీదేవి పార్టీ కోసం పని చేయకుండా ఆర్థికంగా సంపాదించు కోవాలనే తపనలో ఉన్నారన్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. ఆమె చేసిన అక్రమాలు దృష్ట్యా ఆమెకు టికెట్ ఇచేది లేదని ముఖ్యమంత్రి చెప్పడంతో ఎమ్మెల్సీ ఎన్నికలలో పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. తెలుగుదేశం పార్టీకి వెన్నుపోటు పొడవడం, డబ్బులిచ్చి ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం అలవాటేనని అన్నారు. ఆనం రామనారాయణ రెడ్డి కూడా ఈ విధంగా వ్యవహరిస్తారని ఊహించలేదని అన్నారు. మంత్రి పదవి ఇవ్వలేదని పార్టీకి దూరంగా ఉన్నారన్నారు. మంత్రి పదవి కోసం కాంగ్రెస్ నుంచి టిడిపి లోకి, తర్వాత వైసిపి లోకి వచ్చారని అన్నారు. పేదల సంక్షేమం కోసం ఏప్రభుత్వమైనా అప్పులు చేయక తప్పదని అన్నారు.

రైట్ టు హెల్త్ బిల్లు వైద్య రంగానికి నష్టం

ప్రజాశక్తి- విజయనగరం కోట

రైట్ టు హెల్త్‌బిల్ వైద్య రంగానికి, ప్రజలకు హాని కలిగిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జెసి నాయుడు, కార్యదర్శి సి.సురేష్ బాబు, ఐఎంఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎ.మధుకర్, కార్యదర్శి డాక్టర్ బి.మహేంద్రగిరి అన్నారు. సోమవారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఆరోగ్య హక్కు కల్పన పేరుతో డాక్టర్ల స్వేచ్ఛను హరించే చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న డాక్టర్లపై రాజస్థాన్ ప్రభుత్వం లాఠీలు ఝుళిపించడాన్ని ఖండించారు. ప్రైవేట్ డాక్టర్లు ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వాలు వైద్యరంగ విషయంలో డాక్టర్ల విషయంలో ఏదైనా బిల్లు ప్రవేశ పెట్టాలంటే వైద్యుల సలహాలు తీసుకోవాలని కోరారు ఏ ప్రభుత్వాలైనా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోరాదన్నారు. రాజస్థాన్ ప్రభుత్వం వెంటనే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ బిల్లు ప్రకారం ఏదైనా ఒక ఎమర్జెన్సీ కేసును తీసుకోవాల్సి వస్తే అన్ని రోగాలకు ఒకే రకమైన డాక్టర్ వైద్యం చేయలేడు కాబట్టి ఏదైనా జరగరాని సంఘటన జరిగితే ఈ సందర్భంలోనే బాధితులు దాడులు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ బిల్లు డాక్టర్ల మనోభావాలు దెబ్బతినేలా ఉందన్నారు. ఈ సందర్భంగా నిరసన తెలిపారు.



నిరసన తెలుపుతున్న ఐఎంఎ, ప్రైవేటు నర్సింగ్‌హోమ్స్ అసోసియేషన్ నాయకులు

ఐసిడిఎస్ ప్రాజెక్టు గుర్లలోనే

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గుర్ల

నెల్లిమర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఎత్తివేత శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు ప్రజాప్రతినిధులు స్పందించారు. నెల్లిమర్ల ఐసిడిఎస్ ప్రాజెక్టును ఎత్తివేసి నెల్లిమర్లమండలాన్ని విజయనగరం లోను, గుర్ల మండలాన్ని గరివిడిలోగల ప్రాజెక్టులో కలిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో ప్రచురితమైన వార్తతో గుర్ల మండల నాయకులు సోమవారం రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణకు. జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావుకు వినతి అందజేశారు. గుర్లలోనే ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి వెంటనే అధికారులతో మాట్లాడి ప్రాజెక్టు కార్యాలయాన్ని గుర్లలో ఏర్పాటు చేయాలని సూచించారు

కనీస వేతనం చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి- విజయనగరం కోట

ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్, అద్దెబస్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ ఆర్‌టిసిలో ప్రభుత్వ బస్ సర్వీసులతో పాటు, డ్రైవర్ల సంఖ్య కూడా తగ్గుతుందని అన్నారు ఈనేపథ్యంలో ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సేవలు అందిస్తున్నారని, వీరి వేతనాల్లో మాత్రం అత్యంత వ్యత్యాసం ఉందని అన్నారు. కిలోమీటర్ల ప్రాతిపదికన జీతం నిర్ణయించడంతో ఔట్ సోర్సింగ్ డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా కారణంతో బస్సు ఆగినా, లోడింగ్ అన్లోడింగ్ సమయంలో ఇబ్బంది జరిగినా, ప్రమాదాలు జరిగే సందర్భాల్లోను ఒక రోజు వేతనం నిలుపుదల చేస్తున్నారని, రిపేర్లకు అవసరమైన డబ్బులు డ్రైవర్ల నుంచి కలెక్ట్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా జీతాలు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్గో సర్వీసులకు పరిమితికి మించి లోడింగ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో యూనియన్ గౌరవ అధ్యక్షులు జెఎస్ఎన్ రాజు, నాయకులు సురేష్, ధనుంజయ్, జగదీష్, నాయుడు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆర్‌టిసి ఒప్పంద కార్మికులు

28న రవాణా రంగ కార్మికుల సదస్సు

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మోటారు వాహన చట్టం 2020, జీవో నెంబర్ 21ను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 28న కోట జంక్షన్ వద్ద జరిగే మోటారు వాహన డ్రైవర్ల సదస్సును జయప్రదం చేయాలని ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. సంబంధిత గోడపత్రికను కోట ఆటో స్టాండ్ వద్ద ఆవిష్కరించారు.

నమూనా వ్యవసాయానికి నాబార్డ్ చేయూత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఒక ఎకరా స్థలంలో సేంద్రీయ వ్యవసాయ నమూనా చేపడితే దానికి నాబార్డ్ చేయూతనందిస్తుందని నాబార్డ్ డిడిఎం టి.నాగార్జున స్పష్టం చేశారు. సోమవారం ఆయన సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి టిష్యూ కల్చర్, సేంద్రీయ వ్యవసాయం, పొద్దు తిరుగుడు, వర్మి కంపోస్ట్, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఇంటర్న్ షిప్ చేస్తొన్న బిఎస్‌సి వ్యవసాయ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు ఆయనను సత్కరించారు.

అనస్తీషియా-నిపుణుల పాత్రపై సదస్సు

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో సంక్లిష్ట పరిస్థితుల్లో అనస్తీషియా-నిపుణుల పాత్ర అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా విశాఖ నుంచి బృందా కేన్సర్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ వంశీదర్ పుత్రేవు, డాక్టర్ ఊహ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వంశీదర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టించే మనస్తత్వం, క్లినికల్ పాఠ్యాంశాలపై పట్టుకలిగి ఉండాలన్నారు. డాక్టర్ ఊహ మాట్లాడుతూ అనస్తీషియా టెక్నాలజిస్టుల బాధ్యత, వివిధ విభాగాలలో చేయాల్సిన పనులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, పారామెడికల్ డీన్ డాక్టర్ లక్ష్మీనరసింహ, వివిధ విభాగాధిపతులు రేడియోలజీ డాక్టర్ నూకరాజు, అనస్తీషియా నుంచి రషీద్, మజీద్ భట్, డాక్టర్ చైతన్య, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

నాబార్డ్ డిడిఎం నాగార్జున



విసితో చర్చిస్తున్న డిడిఎం టి. నాగార్జున

కంటిచూపు పరిరక్షణ కీలకం

ప్రతి ఒక్కరూ కంటి చూపును పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. వరల్డ్ ఆప్టొమెట్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన వర్క్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఎల్వి ప్రసాద్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన ఎం.శ్రీకాంత్ వర్క్‌షాప్ ఆన్ ట్రబుల్ షూటింగ్ ఇన్ పాల్స్ అనే అంశంపై ప్రసంగించారు. కంటి అద్దాలను నిత్యం పరిశీలిస్తూ జీవన శైలి వల్ల కలిగే మార్పులను గుర్తించి రోగులకు తెలియజేయడం వల్ల దృష్టి లోపాలను నివారించవచ్చనన్నారు. అనంతరం విశాఖ ఎల్‌వి ప్రసాద్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన రామ్ కుమార్ కంటి అద్దాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పారా మెడికల్ డీన్ డాక్టర్ ఎం.లక్ష్మీనర సింహాచార్యులు, విభాగాధిపతి శ్రావణి, దినేష్, బెనర్జీ పాల్గొన్నారు.

సమస్యలపై మంత్రికి యుటిఎఫ్ వినతి

గరివిడి : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకి యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గొర్లె వర్మఖాతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సమస్యల పై వినతి పత్రం అందించారు. గరివిడి క్యాంపు కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం సమస్యలతో కూడిన వినతిని ఆయనకు అందించారు. సింగిల్ సెక్షన్, యాప్‌ల భారం తగ్గించాలని సిపిఎస్ మొదలైన అంశాలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ. సత్యశ్రీనివాస్, మండల అధ్యక్షులు ఎం. రవికుమార్, మండల గౌరవాధ్యక్షులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సురేష్‌బాబుకు అభినందనలు

నెల్లిమర్ల : రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన తరువాత తన స్వగ్రామం మొయిద వచ్చిన పెనుమత్స సురేష్‌బాబును పలువురు అభినందించారు. ముందుగా ఆయనకు గ్రామస్తులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. తన తండ్రి దివంగత పెనుమత్స సాంబశివ రాజు సమాధి వద్ద ఆయన నివాళులు అర్పించి అనంతరం వారి తల్లి వెంకట రమణమ్మ ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆయనకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండోకు క్రీడాకారులు

బొబ్బిలి : రాజస్థాన్‌లో ఈనెల 28 నుంచి 31 వరకు జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ విభాగంలో జి.చరిత, బి.యశస్విని, క్యాడెట్ విభాగంలో జి. జాహ్నవి ఎంపికయ్యారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులను టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబీనాయన సోమవారం అభినందించారు. కార్యక్రమంలో కోచ్ బంకురు ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

324 పశువులకు తనిఖీలు

రేగిడి : మండలంలోని మునకాలవలస గ్రామంలో సోమవారం 324 పశువులకు ఉచిత వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ ఉచిత పశువైద్య శిబిరాన్ని ఉణుకూరు పశువైద్యాధికారి వి రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. 28 పశువులు రోగాల బారిన పడినట్లు గుర్తించి వ్యాక్సినేషన్ వేశారు. జివిఎంఆర్‌బిటి రాజాం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కెవిఎస్ ప్రసాద్ సమక్షంలో 50 మంది వాలంటీర్లతో గ్రామంలో బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ జూనియర్ అసిస్టెంట్లు విజయలక్ష్మి, అనిల్, జగదీష్, నాగలక్ష్మి గ్రామ ప్రజలు, గ్రామ యువత, సచివాలయం సిబ్బంది లక్ష్మి, అనిల్, జగదీష్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సికి ఇద్దరు వైద్యాధికారులు

గజపతినగరం : మండలంలోని మరుపల్లి పిహెచ్‌సికి కొత్తగా మరో ఇద్దరు వైద్యాధికారులు డి.సుష్మ, కె.పుష్పాంజలి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీరు మహాత్మా గాంధీ మెడికల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో ఎంబిబిఎస్ పూర్తిచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104, ఫ్యామిలీ డాక్టర్ సేవలు ద్వారా వైద్యాన్ని గ్రామాలలో మరింత విస్తృతంగా అందిస్తామన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు పై ఉచిత శిక్షణ

శృంగవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరావు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఐటిఐ చదివిన 18 నుంచి 28 ఏళ్ల యువతీ యువకులు అర్హులని అన్నారు. 3 నెలలు శిక్షణ ఇచ్చి తర్వాత ప్రముఖ కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 7995691295, 9000234642 నంబర్లలను సంప్రదించాలన్నారు. ఆశక్తి గల అభ్యర్థులు మంగళవారం కాలేజీకు వచ్చి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. తరగతులు ఏప్రిల్ 5వ తేదీ నుండి మొదలవుతాయని కళాశాల కోఆర్డినేటర్, కామర్స్ లెక్చరర్ జి. ఈరన్న తెలిపారు.

వంద శాతం పన్నులు వసూలు కావాలి

నెల్లిమర్ల : నగర పంచాయతీలో వంద శాతం పన్నులు వసూలు జరగాలని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ సూచించారు. సోమ వారం స్థానిక కార్యాలయంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, నీటి పన్నులు వంద శాతం వసూళ్లలో భాగంగా వార్డు సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలాఖరుకి అనుకున్న లక్ష్యాలు చేరుకోవడానికి సచివాలయం సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వర రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి. త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మను దర్శించుకున్న మాజీ ఎంపి

మెరకముడిదాం : మండలంలోని పెద మంత్రిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన బంగారమ్మ గుడి ప్రతిష్ఠా మహోత్సవంలో సోమవారం మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా ఉండాలన్నారు. గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నారు, పాడి పంటలతో కళకలలాడాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణ రాజు, వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, మాజీ జెడ్‌పిటిసి కోట్ల వెంకటరావు, బూర్లె నరేష్ కుమార్, తాడ్డి చంద్రశేఖర్, పప్పల గ్రూహిశ్వరరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ హర శ్రీరాములు, కర్రోతు నాగేశ్వరరావు, తాడేల ఉమా మహేశ్వరరావు ఆలయ ధర్మ కర్తలు తాడేల చిరంజీవి, తాడేల రజని, గ్రామ పెద్దలు పలువురు పాల్గొన్నారు.

శివాలయంలో సుబ్రహ్మణ్య షష్టి

నెల్లిమర్ల : మండలంలోని తంగుడుబిల్లి శివాలయంలో సోమవారం ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో సుబ్రహ్మణ్యస్వామి నాగ ప్రతిమ ప్రతిష్ఠ కార్యక్రమం పట్నాయక్ శ్రీనివాస నరసింహ దంపతులు, కొడితల శేఖర్ దంపతులు పట్నాయకుని రామానుజనాయులు ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి చందక చిన్నంనాయుడు, సర్పంచ్ పిన్నింటి చిన్నంనాయుడు, మాజీ సర్పంచ్ పాలూరి తిరుపతిరావు, కర్నేసేన రాజేశ్వరరావు మాస్టర్, ఎంఆఇ అంబళ్ళ కృష్ణారావు ఇతర నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడే వారి సమాచారమివ్వండి

రామభద్రపురం: నేరాలకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని వెంటనే తెలియ పరచాలని స్థానిక ఎస్ఐ సురేంద్ర నాయుడు ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సచివాలయం మహిళా పోలీస్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారి సమాచారంతో పాటు పేకాట, అక్రమ మద్యం అమ్మకాలు, మత్తు పదార్థాల విక్రయాల పై నిఘా పెట్టాలన్నారు.

క్వారీ యాజమాన్యాలతో చర్చలు సఫలం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మండలంలోని వెంకటరమణ పేట, మల్లెపూడి క్వారీ యాజమాన్యాలతో కార్మికుల వేతన ఒప్పందం కోసం సోమవారం జరిపిన చర్చలు సఫలీకృతం అయ్యాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ క్వారీ కార్మికులకు సిఐటియు ఆధ్వర్యంలో యాజమాన్యంతో వేతనాలపై ఒప్పందం కుదిరిందన్నారు దీని ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరి-1 నుంచి 2029 ఫిబ్రవరి 1వరకు వరకు దసలవారీగా వేతనాలు పెంచేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. మొదటి సంవత్సరం ప్రస్తుతం ఉన్న జీతంపై రూ.1500 పెంచేందుకు అంగీకరించారని. రెండో ఏడాది రూ.1500, మూడో ఏడాది వెయ్యి రూపాయలు నాలుగు, ఐదు, ౬ ఆరో సంవత్సరంలో కూడా వెయ్యి రూపాయలు చొప్పున పెంచేందుకు అంగీకరించారని తెలిపారు. అలాగే కార్మికులు ఎనిమిది గంటల పని దినం చేయాలని ఒప్పందం కుదిరిందన్నారు. కార్మికులకు ప్రతి నెలా 15వ తేదీకి జీతం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. ఈ అగ్రిమెంట్ చర్చల్లో యాజమాన్యం తరపున పి.వెంకటరావు, వి. దివాకర్, ఎ.నరేష్, ఆర్.చంద్రశేఖర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, సిఐటియు ఎస్ కోట మండల కమిటీ నాయకులు చెలికాని ముత్యాలు, క్వారీ కార్మిక సంఘ నాయకులు ఎర్ర ప్రగడ భాస్కరరావు, పోకల భాస్కరరావు , ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సోలార్ దీపాలు

లక్కవరపుకోట : మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల ఆశ్రమ పాఠశాలకు కొత్తవలస శారద మెటల్ పరిశ్రమ యాజమాన్యం సోలార్ దీపాలను అందజేశారు. రూ. 1.20 లక్షలు విలువచేసే 8 సోలార్ దీపాలను ఉదారంగా అందజేసిన పరిశ్రమ యాజమాన్యానికి ప్రిన్సిపల్ పాత్రో ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పాత్రో మాట్లాడుతూ సోలార్ దీపాలను పాఠశాల ప్రహరీ చుట్టూ అమర్చునున్నట్లు తెలిపారు.

పెరటి కోళ్ల పెంపకంతో జీవనోపాధి

మెరకముడిదాం : పెరటికోళ్ల పెంపకం ద్వారా ప్రతి కుటుంబ తమ జీవనోపాదిని మరింత పెంపొందించు కోవచ్చునని వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయం ఆవరణలో 50 మహిళా సంఘ సభ్యులకు సోమవారం పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క యూనిట్లో పది కోళ్లు వుంటాయన్నారు. యూనిట్ ఖరీదు రూ.2,647 మాత్రమేనన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి

కొత్తవలస: కొత్తవలస రైల్వే స్టేషన్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు రైల్వే బోర్డు ఉన్నతాధికారులను కోరారు. సోమవారం కొత్తవలస రైల్వే స్టేషన్‌ను రైల్వే బోర్డు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ మెంబర్స్ దిలీప్‌కుమార్ మాలిక్, అభిజిత్ దాస్, నిర్మల కిశోర్, జీవి మంజునాధ్, గీతల ఉమారాణి, పరుశు రాం సందర్శించారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రైల్వే స్టేషన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు కొత్తవలస రైల్వే స్టేషన్‌ను సందర్శించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షులు చొక్కాకుల అప్పారావు, సత్య సాయి బాబా భజన మండలి సభ్యులు కమిటీకి వినత పత్రం ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రోటోకాల్ కన్వీనర్ బాల రాజేశ్వర రావు, వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

సిఎం పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన హామీని నిలబెట్టు కొన్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ క్రాంతి పదం ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల నాటికి పొదుపు సంఘాల మహిళల పేరిట బ్యాంకుల్లో ఉన్న అప్పును దఫలవారీగా మహిళలు ఖాతాల్లో వేస్తామన్న మాట ప్రకారం ఇప్పుడు మూడో విడత వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, ఎంపిపి సంబంగి లక్ష్మీ, మండల వైసిపి అధ్యక్షులు శంబంగి వేణు గోపాల్ నాయుడు, బుడా ఛైర్మెన్ ఇంటి పార్వతి, పట్టణం వైసిపి అధ్యక్షులు ఇంటి గోపాల్ రావు, జెడ్‌పిటిసి యస్.శాంతి కుమారి, కమిషనర్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ భాస్కరరావు, మెప్మా పీడీ సుధాకర్, డిపియం బి.బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని 1602 స్వయం సహాయక సంఘాలకు రూ.8.87 కోట్లకు నేరుగా మహిళలు ఖాతాల్లో జమ చేయడం జరిగిందని ఎస్ కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో లలితా కన్వెన్షన్ హాల్లో సోమవారం ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు అండగా ఉన్న సిఎంకు మహిళలు కూడా రాబోయే ఎన్నికల్లో తోడుగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టీ గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జెసిఎస్ కన్వీనర్ బొంతుల వెంకటరావు, వైస్ ఎంపిపి కర్రీ శ్రీను, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిఎల్ఎఫ్ సభ్యులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులంతా ప్రయోజకులు కావాలి

ప్రజాశక్తి - వేపాడ



విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ అందిస్తున్న కృష్ణ

ప్రతి విద్యార్థీ ప్రయోజకుడిగా ఎదగాలని టిడిపి నియోజకవవర్గం యువ నాయకులు గొంప కృష్ణ అన్నారు. మండలంలోని వావిలపాడు జిల్లా పరిషత్తు పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఆయన చేతులు మీదుగా పరీక్షా మెటీరియల్‌ను పంపిణీ చేశారు. అనంతరం ఎన్‌కెఆర్‌పురం, బికెఎస్‌పేట కేజీవీబీ వసతి గృహ విద్యార్థులకు, ఎపి ఆదర్శపాఠశాల, వేపాడ, సోంపురం, బొద్దాం జిల్లా పరిషత్తు పాఠశాల, కేజీపూడి ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహం విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్లు, స్కేలు, రబ్బర్లు పంపిణీ చేశారు. గొంప కృష్ణ మాట్లాడుతూ కష్టపడి ప్రతి విద్యార్థి చదివి ప్రయోజకులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమములో టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, టిడిపి నాయకులు జి నాగరాజు, మంచిన అప్పలసూరి, ఎస్ సూర్యనారాయణ, ఎస్ రమణ, ఎస్ గణేష్, టి, కృష్ణ, వై సూర్యం, సిహెచ్ దేవుడు, సేనాపతి అప్పారావు, కోటానా అర్జునరావు, ఎస్, వెంకటరావు, గొర్రిపోటు వెంకటరమణ, శంకర్రావు, రాము నాయుడు పలువురు టిడిపి నాయకులు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - కొత్తవలస

పదో తరగతి విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రజ్ఞా వికాస పరీక్షల విజేతలకు మండలంలో కొత్తవలస ఎస్ఐ. బి. దేవి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ ఐ. దేవి మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్‌లో మంచి ఫలితాలు సాధించినందుకు విజేతలకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేసారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష భయాన్ని పోగొట్టడానికి మోడల్ పదవ తరగతి పరీక్ష జిల్లా వ్యాప్తంగా 12వేల మందితో నిర్వహించామని తెలిపారు. ఈ మోడల్ పదో తరగతి పరీక్షల్లో మండలంలో మొదటి స్థానంలో 86 మార్కులతో వి.శ్యామ్ దినేష్ (రవీంద్ర భారతి స్కూల్) 82 మార్కులతో జి.మురళి కృష్ణ (సెయింట్ ఆన్స్ స్కూల్, మంగళపాలెం), మూడో స్థానంలో సంయుక్తంగా 82, 79 మార్కులతో జి.నీరజ, వి.మేఘన (ఏపీ మోడల్ స్కూల్) మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిల్చారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. పరీక్షను విజయవంతం చేసిన విద్యార్థులకు, పాఠశాల యాజమాన్యాలకు, టీచర్లకు కృతజ్ఞతలు తెలిపారు. పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం మార్కులు సాధించేలా, ప్రణాళికబద్ధంగా చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కొత్తవలస మండల కార్యదర్శి వి.నాయుడు, నాయకులు లోకేష్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శివప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీలో పాల్గొనండి

నెల్లిమర్ల : కార్మిక, కర్షక హక్కుల కోసం ఏప్రిల్ 5న ప్రజా సంఘాలు చేపట్టిన మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు యుఎస్ రవికుమార్, నగర ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావులు కోరారు. సోమవారం సిఐటియు అధ్వర్యంలో స్థానిక ఏపి బెవరేజేస్ డిపో వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారం లో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందన్నారు. ఈ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులు కాలరాస్తుందన్నారు. దేశ సంపదను అధాని,అంబానీలు కట్టబెట్టి దోపిడీ చేస్తున్నారన్నారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఉపాధిహామీ చట్టానికి బడ్జెట్‌లో రూ. 2లక్షల కోట్లకు పెంచాలని, పట్టణాలకు విస్తరింప చేయాలని, కుటుంబానికి 200 రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మోనిటైజేషన్ పైప్‌లైన్ రద్దు చేయాలని, అటవీ హక్కుల చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక, రైతు, వ్యవసాయ, కౌలు రైతు సంఘాల చేపట్టిన ఏప్రిల్ 5 న చలో ఢిల్లీ కార్యక్రమంలో జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో నాయకులు రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలి

బొబ్బిలిరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సోమవారం ఎం.బూర్జవలస సచివాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు విద్యుత్ చార్జీలు పెంచడంతో ఆయా పరిశ్రమలు మూత పడే ప్రమాదం ఉందన్నారు. ఫెర్రో పరిశ్రమలు మూత పడితే కార్మికులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ చార్జీలు, ముడి సరుకుల ధరలతో ఫెర్రో పరిశ్రమలు నష్టాల్లో నడుస్తున్నాయన్నారు. ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్ రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం, కె. శంకరరావు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఛార్జీల పెంపు అన్యాయం

బొబ్బిలి : ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్ చార్జీల పెంపు అన్యాయమని పిసిసి సభ్యులు ముప్పల శ్రీనివాసరావు అన్నారు. కాంగ్రెసు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్ చార్జీలు పెంచడంతో ఆయా పరిశ్రమలు మూత పడతాయన్నారు. ఫెర్రో పరిశ్రమలు మూత పడితే కార్మికులు రోడ్డున పడతారని, పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సచివాలయ సేవలు మెరుగుపడాలి

ప్రజాశక్తి- వంగర

సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు మెరుగుపర్చాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆదేశించారు. వంగర మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా అందుతున్న సేవలను పరిశీలించి, అసంతృప్తి వ్యక్తం చేశారు. సేవల సంఖ్యను పెంచాలని సూచించారు. సచివాలయం, ఆర్‌బికె తదితర ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలన్నారు. జగనన్న ఇళ్ళ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, కాలనీలో రోడ్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. గ్రామంలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. గర్భిణులు, పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించాలని, హిమోగ్లోబిన్ తక్కువ ఉన్నవారికి పోషకాహారం, అవసరమైన మందులను అందించాలని సూచించారు. ఆధార్ సేవలు, పంట రుణాలు, డ్రాపౌట్లు, పోషకాహార పంపిణీ, ప్రకృతి సేద్యం, ఇతర సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అన్ని గ్రామాల్లో చెత్తశుద్ధి కేంద్రాలను నిర్మించి, వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన విద్యార్థులకు, జాప్యం చేయకుండా వెంటనే జారీ చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో తహశీల్దార్ ఐజాక్, ఎంపిడిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

రామభద్రపురం మండల కేంద్రం హైవే పక్కన ప్రభుత్వ స్థలం ఆక్రమణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆర్డిఒ పి.శేషశైలజకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు పి.శంకరరావు, పిసిసి సభ్యులు ముప్పల శ్రీనివాసరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, జనసేన నాయకులు మహంతి ధనుంజయ్ మాట్లాడుతూ మండల రెవెన్యూ అధికారుల సహకారంతో అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ స్థలాన్ని అక్రమించేసి అమ్మేసుకుని సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రూ.8కోట్లు విలువ చేసే స్థలాన్ని కాపాడాలని ఆర్డిఒను కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవం

వేపాడ : మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో నిర్మించిన ఏడువాక గంగరాజమ్మ మెమోరియల్ గ్రంథాలయం పదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయం దాత ఏడువాక కిత్తం నాయుడు మాట్లాడుతూ ఈ గ్రంథాలయంలో చదువుకున్న ఎందరో విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో రాణించారన్నారు. గ్రంథాలయాలాభివృద్ధికి సహాయ పడతాయన్నారు.

నలుగురు దొంగలు అరెస్ట్

విజయనగరం : బాలాజీ మార్కెట్‌లో బట్టలు షాపులో దొంగతనానికి పాల్పడిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఒకటో పట్టణ సిఐ బి. వెంకటరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన తమ పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ఈ నెల 23 రాత్రి బాలాజీ మార్కెట్ షాపు నంబరు 304 యజమాని అరుణ్ కుమార్ అగర్వాల్ షాపు మూసివేసి ఇంటికి వెళ్లిపోగా, ఎవరో గుర్తు తెలియని దొంగలు మారు తాళంతో షాపు షట్టరు తలుపు తీసి, లోపలకు ప్రవేశించి, దఫ దఫాలుగా సుమారు రూ.1.90 లక్షల విలువైన బట్టల మూటలు దొంగిలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తు లుగా బొండపల్లి మండలం జియ్యన్నవలసకు చెందిన చుక్క, పడాల శంకర్, ఎర్ర శ్రీను, పట్నాల అప్పల నాయుడులుగా గుర్తించాం. వారి వద్ద నుండి రూ.75 వేలు నగదు, 10 నైటీ మూటలను రికవరీ చేసి, నిందితులు నలుగురిని రిమాండుకు తరలించినట్లుగా ఆయన తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఇంటర్ విద్యార్థిని మృతి

రేగిడి : మండలంలోని అంబాడ వెంకటాపురం సర్పంచ్, వైసిపి నాయకులు చుక్కా వెంకట నాయుడు కుమార్తె చుక్కా వినీత (20) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. విశాఖపట్నం జిల్లా బోయపాలెం నారాయణ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ అనారోగ్యానికి గురైంది. తల్లిదండ్రులు ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కుమార్తె మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

కుక్క అడ్డురావడంతో..

వేపాడ : మండలంలోని బీవీ పాలెం గ్రామమునకు చెందిన పిల్ల అప్పలనాయుడు(48) ఆదివారం రాత్రి బీవీ పాలెం నుండి ఆనందపురం వెళు తుండగా బల్లంకి జంక్షన్ వద్ద కుక్క బైకుకు అడ్డు రావడంతో అదుపు తప్పి పడిపోయాడు. అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం విశాఖ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తన సొంత గ్రామం వచ్చి తిరిగి విశాఖపట్నం వెళ్లే సమయంలో ఈ ప్రమాదం జరిగిందని మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏ ఎస్ ఐ గోపికృష్ణ తెలిపారు.

గజపతినగరం : స్థానిక యార్డు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పట్టాలపై గుర్తించినట్లు బొబ్బిలి జిఆర్‌పి ఓ.పి ఇంఛార్జి హెచ్‌సి కృష్ణారావు ఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ బి.ఈశ్వర్ రావు, పి.సిలు ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. మృతి చెందిన వ్యక్తి 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండొచ్చునని, వికలాంగుడని తెలిపారు.